సూరీడుని ముద్దాడిన 'పార్కర్'!

- కరోనాకు చేరువగా నాసా ప్రోబ్
- వేడి గుట్టు తెలుసుకోవడమే లక్ష్యం
- సూర్యుడికి అతి సమీపంగా వెళ్లిన మొదటి వ్యోమనౌకగా రికార్డు
- గంటకు 7 లక్షల కి.మీ. వేగంతో 21 సార్లు సూర్యుడి చుట్టూ ప్రదక్షిణ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): మానవ రోదసి ప్రయోగాల్లో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. భగభగ మండే సూర్యుడికి అత్యంత దగ్గరగా వెళ్లిన మొట్టమొదటి వ్యోమనౌకగా అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రయోగించిన పార్కర్ సోలార్ ప్రోబ్ రికార్డు సృష్టించింది. ఈ మేరకు నాసా వెల్లడించింది.

ఏమిటీ స్పేస్‌క్రాఫ్ట్?

2018లో పార్కర్ సోలార్ ప్రోబ్ మిషన్‌ను నాసా చేపట్టింది. ఇప్పటికే ఆ స్పేస్‌క్రాఫ్ట్ 21 సార్లు సూర్యుడిని చుట్టేసింది. అంటే, మొత్తంగా 14.9 కోట్ల కిలోమీటర్ల దూరం ప్రయాణించింది. గంటకు 6 లక్షల 92 వేల కిలోమీటర్ల వేగంతో పార్కర్ ప్రోబ్ ప్రయాణిస్తుంది. అంటే గన్ నుంచి వచ్చే బుల్లెట్ వేగం కంటే 200 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది.

ఇప్పుడు పరిస్థితి ఏమిటి?

మంగళవారం సాయంత్రం సూర్యుడి బాహ్య వలయమైన కరోనాకు సుమారు 61 లక్షల కిలోమీటర్ల దూరం వరకూ పార్కర్ ప్రోబ్ చేరుకొన్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. బుధ గ్రహానికి, సూర్యుడికి మధ్య ఉన్న ఎడానికి ఇది 8 రెట్లు తక్కువ దూరమని పేర్కొన్నారు.

అంత ఈజీ కాదు..

సూర్యుడి కరోనా ప్రాంతంలో అతిభయంకరమైన వాతావరణం, రేడియేషన్ ఉంటుంది. ఉష్ణోగ్రత చాలా ఎక్కువ. దీన్ని తట్టుకుని పార్కర్ వ్యోమనౌక డాటాను సేకరించాల్సి ఉంటుంది. అందుకే సూర్యుడి నుంచి వెలువడే ఉష్ణానికి దెబ్బతినకుండా పార్కర్ ప్రోబ్‌ను బలమైన హీట్‌షీల్డ్‌తో కవర్ చేశారు. టైటానియమ్-జిర్కోనియమ్-మాలిబ్డినమ్‌తో తయారు చేసిన ఈ ప్లేట్ 2,349 డిగ్రీల సెంటిగ్రేడ్ (4,260 డిగ్రీల ఫారన్‌హీట్) ఉష్ణోగ్రతలను కూడా తట్టుకోగలదు.

ఫలితాలు ఎప్పుడు?

సూర్యుడి కరోనాను సమీపించిన పార్కర్‌కు అంత వేడిలో సిగ్నల్స్‌ను భూకేంద్రానికి పంపించడం కుదరకపోవచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ, సూర్యుడి వేడిని తట్టుకొని ప్రోబ్ నిలబడితే శుక్రవారం నాటికి సిగ్నల్స్ వచ్చే అవకాశమున్నది.

ఎందుకు ఈ మిషన్?

గత కొన్ని శతాబ్దాలుగా శాస్త్రవేత్తలు సూర్యుడి గురించి పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. సూర్యుడి కేంద్రంలో అత్యంత ప్రహ్మాండమైన ఉష్ణోగ్రతలకు కారణమేమిటన్న విషయం ఇప్పటివరకూ కచ్చితంగా తెలియరాలేదు. అలాగే, సూర్యుడి బాహ్య వలయమైన కరోనా (ఉపరితలం) అంత వేడిగా ఉండటానికి గల కారణాలు, సూర్య తుఫానులను కూడా విశ్లేషించాల్సి ఉంది. అయితే, ఈ విషయాలు భూవాతావరణం, రోదసిలో నుంచి కంటే కరోనా లేయర్‌కు సమీపంలో ఉండి విశ్లేషిస్తే మరింత కచ్చితమైన ఫలితాలు వస్తాయన్న ఉద్దేశంతో ఈ మిషన్‌ను ప్రయోగించారు.

రేప్, యాసిడ్ దాడి బాధితులకు వైద్య నిరాకరణ నేరం

ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబర్ 24: ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలు, నర్సింగ్స్ హోమ్‌లు రేప్, యాసిడ్ దాడి, లైంగిక హింస బాధితులకు ఉచిత వైద్య చికిత్సను నిరాకరించలేవని ఢిల్లీ హైకోర్టు సోమవారం స్పష్టం చేసింది. తండ్రి చేతిలో రేప్‌కు గురైన 16 ఏండ్ల బాలికకు వైద్యం అందించాలని కోర్టు చెప్పినా ఓ ప్రైవేట్ దవాఖాన ఆమెను వైద్యం కోసం నిరీక్షించేలా చేయడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. లైంగిక వేధింపుల బాధితులకు వైద్యం చేయడానికి నిరాకరించే వైద్యులు, వైద్య సిబ్బంది శిక్షార్హులవుతారని హెచ్చరించింది. 'ఉచిత వైద్యంలో ఎలాంటి పరీక్షలైనా చేయాల్సిందే. దీర్ఘ కాలంలో బాధితులకు అవసరాన్ని బట్టి శారీరక, మానసిక కౌన్సెలింగ్ ఇవ్వాల్సిందే' అని కోర్టు తెలిపింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని దవాఖానలకు కోర్టు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. 'లైంగిక దాడి, రేప్, గ్యాంగ్ రేప్, యాసిడ్ దాడి బాధితులకు ఇన్-పేషంట్, ఔట్ పేషంట్ వైద్య సేవలు ఉచితం' అనే బోర్డును ప్రదర్శించాలని హాస్పిటల్స్‌ను కోరింది.

అమెరికాలో స్తంభించిన విమాన సేవలు

సాంకేతిక సమస్యతో గంటపాటు గ్రౌండింగ్

వాషింగ్టన్, డిసెంబర్ 24: క్రిస్మస్, కొత్త సంవత్సరం సెలవుల సందర్భంగా అమెరికాలో విమాన ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. సాంకేతిక సమస్యల కారణంగా అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన అన్ని విమానాలు అమెరికాలోని విమానాశ్రయాలలోనే ఉండిపోవాలని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) మంగళవారం ఆదేశించింది. దీంతో ఉదయం 7 గంటలకు అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానాలన్నీ దేశవ్యాప్తంగా గ్రౌండింగ్ అయ్యాయి. గంట తర్వాత విమానాలన్నిటినీ టేకాఫ్‌కు అనుమతి ఇచ్చినట్టు ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. ప్రయాణికులు తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే సాంకేతిక సమస్య ఏమిటో మాత్రం వారు వెల్లడించలేదు.

విమానాల్లో హ్యాండ్ బ్యాగేజీపై ఆంక్షలు

7 కిలోల బరువుండే ఒకే ఒక బ్యాగేజీకి అనుమతి ▪ బ్యాగేజీ ఎత్తు, పొడవు, వెడల్పుపైనా పరిమితులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 24: విమాన ప్రయాణం చేయదలచిన ప్రయాణికులు ఇక ఎయిర్‌పోర్టుకు బయల్దేరే ముందు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్) ప్రకటించిన కొత్త హ్యాండ్ బ్యాగేజీ విధానం గురించి తెలుసుకోకపోతే చిక్కుల్లో పడకతప్పదు. ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీ చెక్‌పాయింట్ల వద్ద ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిపోతుండడంతో హ్యాండ్ లగేజీ పాలసీకి సంబంధించి నిబంధనలను కఠినతరం చేయాలని బీసీఏఎస్, సీఐఎస్ఎఫ్ నిర్ణయించాయి. దీంతో వివిధ ఎయిర్‌లైన్లు కూడా ఈ కొత్త విధానాన్ని అమలు చేయక తప్పని పరిస్థితి ఎదురైంది. కొత్త బీసీఏఎస్ హ్యాండ్ బ్యాగేజీ పాలసీ ప్రకారం ప్రయాణికులు ఇకపైన విమానంలోకి తమ వెంట ఒక్క బ్యాగేజీ మాత్రమే తీసుకెళ్లడానికి అనుమతి ఉంటుంది. దేశీయ లేదా అంతర్జాతీయ విమానంతో నిమిత్తం లేకుండా ప్రయాణి కుడు తన వెంట కేవలం ఒక హ్యాండ్ బ్యాగేజీని మాత్రమే విమానంలోకి తీసుకెళ్లగలడు. అదనపు బ్యాగేజీ చెక్‌ఇన్ కావలసిందే. ఎకానమీ లేదా ప్రీమియం ఎకానమీ తరగతిలో ప్రయాణించే ప్రయాణికులు తమ వెంట విమానంలోకి 7 కిలోల వరకు బరువున్న ఒక బ్యాగేజీని మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుందని ఎయిర్ ఇండియా ప్రకటించింది. అయితే ఫస్ట్ లేదా బిజినెస్ క్లాస్‌లో ప్రయాణించే ప్రయాణికులు మాత్రం సుమారు 10 కిలోల వరకు బరువుండే ఒకే ఒక హ్యాండ్ బ్యాగేజీని తీసుకెళ్లవచ్చని ఎయిర్ ఇండియా పేర్కొంది. తీసుకెళ్లవచ్చని తెలిపింది. బ్యాగేజీ కొలతలను కూడా ఎయిర్ ఇండియా స్పష్టం చేసింది. బ్యాగేజీ ఎత్తు 55 సెంటీమీటర్లు, పొడవు 40 సెంటీమీటర్లు, వెడల్పు 20 సెంటీమీటర్లు మించరాదని తెలిపింది. ఒక్కో ప్రయాణికుడి హ్యాండ్ బ్యాగేజీ చుట్టుకొలత 115 సెంటీమీటర్లు మించరాదని కూడా తెలిపింది. ఒకవేళ ప్రయాణికుడి హ్యాండ్ బ్యాగేజీ బరువు, విస్తీర్ణం పరిమితిని మించి ఉన్న పక్షంలో అదనపు చార్జీలు భరించక తప్పదని ఎయిర్‌లైన్స్ తెలిపింది. అయితే 2024 మే 2కి ముందు తమ టికెట్లను బుక్ చేసుకున్న ప్రయాణికులకు మాత్రం వెసులుబాటు కల్పిస్తున్నట్టు పేర్కొంది. ఎకానమీ క్లాస్ ప్రయాణికులు 8 కిలోల వరకు, ప్రీమియం ఎకానమీ క్లాస్ ప్రయాణికులు 10 కిలోల వరకు, ఫస్ట్ లేక బిజినెస్ క్లాస్ ప్రయాణికులు 12 కిలోల వరకు బరువుండే హ్యాండ్ బ్యాగేజీని తీసుకెళ్లవచ్చని ఎయిర్ ఇండియా పేర్కొంది.

అమెరికాలో భారత డ్రగ్స్ స్మగ్లర్ హత్య

ప్రతీకారం తీర్చుకున్న బిష్ణోయ్ గ్యాంగ్

న్యూఢిల్లీ: రాజస్థాన్‌లో అనేక కేసులను ఎదుర్కొంటున్న డ్రగ్స్ స్మగ్లర్ సునీల్ యాదవ్ అమెరికాలోని స్టాక్‌టన్ నగరంలో హత్యకు గురయ్యాడు. పాకిస్థాన్ నుంచి భారత్‌లోకి డ్రగ్స్ స్మగ్లింగ్ చేయడంలో ఆరితేరిన సునీల్ యాదవ్ రూ.300 కోట్ల విలువైన మాదక ద్రవ్యాల స్వాధీనం కేసులో ప్రధాన సూత్రధారి. సునీల్ యాదవ్‌ను తామే చంపామంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ రోహిత్ గొదారా ప్రకటించాడు. తమ సోదరుడు అంకిత్ భాదు ఎన్‌కౌంటర్‌లో మరణించడం వెనుక సునీల్ యాదవ్ ఉన్నాడని, పంజాబ్ పోలీసులతో చేతులు కలిపి అతనే ఈ ఎన్‌కౌంటర్ చేయించాడని రోహిత్ గొదారా ఆరోపించాడు. ఇందుకు ప్రతీకారంగానే తాము సునీల్‌ను హతమార్చినట్టు తెలిపాడు.

మణిపూర్ గవర్నర్‌గా అజయ్ భల్లా

- మిజోరం గవర్నర్‌గా వీకే సింగ్
- ఒడిశాకు హరిబాబు.. బీహార్‌కు ఆరిఫ్

న్యూఢిల్లీ: మణిపూర్ గవర్నర్‌గా కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లాను నియమించినట్టు మంగళవారం అధికారిక ప్రకటన తెలిపింది. 2023 మే నుంచి జాతుల మధ్య ఘర్షణతో రగులుతున్న మణిపూర్ గవర్నర్‌గా మాజీ బ్యూరోక్రాట్ నియమితులు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది జూలై 31న మణిపూర్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య స్థానంలో అజయ్ కుమార్ భల్లా నియమితులయ్యారు. అస్సాం-మేఘాలయ క్యాడర్‌కు చెందిన 1984 బ్యాచ్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన అజయ్ భల్లా 2024 ఆగస్టు వరకు దాదాపు ఐదేళ్లపాటు కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా పనిచేశారు. కేరళ ప్రభుత్వంతో తరచూ ఘర్షణ వైఖరిని కొనసాగిస్తున్న ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌ను బీహార్ గవర్నర్‌గా నియమించారు. బీహార్ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కేరళ గవర్నర్‌గా బదిలీ చేశారు. ఒడిశా గవర్నర్‌గా రఘువర్ దాస్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. ఆయన స్థానంలో కంభంపాటి హరిబాబును నియమించారు. దీనికి ముందు హరిబాబు మిజోరం గవర్నర్‌గా ఉన్నారు. తాజాగా మిజోరం గవర్నర్‌గా మాజీ ఆర్మీ చీఫ్ డాక్టర్ వీకే సింగ్ నియమితులయ్యారు. గవర్నర్‌గా వీకే సింగ్ బాధ్యతలు చేపట్టడం ఇదే మొదటిసారి. వీకే సింగ్ గత మోదీ క్యాబినెట్‌లో కేంద్ర మంత్రిగా పనిచేశారు.

ఈఫిల్ టవర్‌లో మంటలు!

- 1200 మంది సందర్శకులను ఖాళీ చేయించిన నిర్వాహకులు
- తాత్కాలికంగా మూసివేత

పారిస్, డిసెంబర్ 24: ఫ్రాన్స్‌లోని ప్రపంచ ప్రఖ్యాత కట్టడం ఈఫిల్ టవర్‌లో మంగళవారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుమారు 1200 మందిని ఆ ప్రదేశం నుంచి ఖాళీ చేయించారు. కొన్ని అంతస్తుల్లో మంటలు కన్పించడంతో అక్కడికి చేరుకున్న అత్యవసర బృందాలు అక్కడ ఉన్న సందర్శకులను ఖాళీ చేయించి, వారిని దూరంగా తీసుకుని పోయారు. ప్రస్తుతం ఈఫిల్ టవర్‌ను తాత్కాలికంగా మూసివేసి మెయింటెనెన్స్ పనులు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎలివేటర్ షాఫ్ట్ వద్ద ఉదయం 10.50 గంటలకు మంటలను చూసినట్టు ఒక ప్రత్యక్ష సాక్షి తెలిపాడు. షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు వచ్చాయని సందర్శకులు అంతా సురక్షితమని నిర్వాహకులు చెప్పారు.

50 వేల ఏండ్ల నాటి ఏనుగు!

సుమారు 50 వేల ఏండ్ల క్రితం నాటి ఏనుగు పిల్ల కళేబరాన్ని శాస్త్రవేత్తలు సైబీరియాలో కనుగొన్నారు. 110 కిలోల బరువున్న ఈ ఏనుగు వయస్సు ఏడాది ఉంటుందని వారు భావిస్తున్నారు. బటగైక అగ్ని పర్వత బిలంలో బయటపడిన ఈ మృతదేహం ఇప్పటికీ చెక్కు చెదరకపోవడం విశేషం!

ట్రూడోకు పదవీగండం

సొంత ఎంపీల నిర్ణయం

టొరంటో, డిసెంబర్ 24: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు పదవీ గండం తప్పేలా లేదు. గత వారం తన మిత్రపక్ష పార్టీల నుంచి తిరస్కరణతో పాటు ఉప ప్రధాని క్రిస్టియా ఫ్రీలాండ్ రాజీనామాతో చిక్కుల్లో పడ్డ ట్రుడో ఇప్పుడు సొంత పార్టీ ఎంపీల నుంచి కూడా నిరసన గళాన్ని ఎదుర్కొంటున్నారు. కెనడా బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్, టొరంటో స్టార్ కథనం ప్రకారం.. దేశంలోని అతి ముఖ్యమైన ఒంటరియో ప్రావిన్స్‌కు చెందిన 51 మంది ఎంపీలు వర్చువల్‌గా సమావేశమై ట్రూడోను పదవి నుంచి సాగనంపాలని నిర్ణయించారు. ఈ ప్రావిన్స్‌లో పార్టీకి 75 మంది ఎంపీలు ఉండగా, క్రమంగా ప్రధానికి మద్దతు తగ్గుతూ వస్తున్నది. వారం రోజుల క్రితమే లిబరల్ పార్టీకి చెందిన 21 మంది ఎంపీలు ట్రూడో దిగిపోవాలంటూ బహిరంగంగా డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ ఎన్నికైన తర్వాత కెనడాను ఉద్దేశించి చేసిన బెదిరింపులపై ప్రధాని ట్రూడో స్పందించకపోవడాన్ని నిరసిస్తూ ఉప ప్రధాని క్రిస్టియా ఇప్పటికే రాజీనామా చేశారు. ఆమె రాజీనామా లిబరల్ నేతల్లో కలవరం కలిగించింది.

బట్టలూడదీసి.. మూత్రం పోసి

- బర్త్‌డే పార్టీకి పిలిచి దళిత బాలుడిపై అమానుషం
- అవమానం భరించలేక బాధితుడి ఆత్మహత్య
- ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన

లక్నో, డిసెంబర్ 24: పుట్టిన రోజు వేడుకకు పిలిచి దారుణంగా అవమానించటాన్ని తట్టుకోలేక ఒక దళిత బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన యూపీలో చోటు చేసుకుంది. నలుగురు వ్యక్తులు తనను దారుణంగా కొట్టి, బట్టలూడదీసి, తనపై మూత్రం పోశారని, ఆ ఘటనను వీడియో తీసి వైరల్ చేస్తామంటూ బెదిరించారని బాధితుడు తల్లిదండ్రులకు తెలిపాడు. వివరాల్లోకి వెళితే.. యూపీలోని బస్తీకి చెందిన 17 ఏండ్ల యువకుడు ఈ నెల 20న ఒక పుట్టిన రోజు వేడుకకు వెళ్లగా, అతనిపై నలుగురు దారుణానికి దిగారు. అతడిని బాగా కొట్టారు. బట్టలూడదీశారు. అతడిపై మూత్రం పోశారు. దానిని వీడియో తీశారు. అనంతరం తమ ఉమ్మిని నాకాలంటూ అతడిని బలవంతం చేశారు. ఆ వీడియో డిలీట్ చేయమంటూ బాధితుడు ఎంత మొత్తుకున్నా వారు వినలేదు. దీంతో అతను ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహాన్ని తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి ఆందోళన చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో వారు బస్తీ ఎస్పీ కార్యాలయం ఎదుట మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేయడంతో ఆయన స్పందించి కేసు నమోదు చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రదీప్ కుమార్ త్రిపాఠి తెలిపారు.

అఫ్గాన్‌లో భారత దౌత్య సిబ్బందిపై దాడి

కాబూల్: అఫ్గానిస్థాన్‌లో క్రియాశీలకంగా లేని జలాలాబాద్‌లోని భారత కాన్సులేట్‌లో పనిచేస్తున్న సిబ్బందిపై మంగళవారం దాడి జరిగింది. దౌత్య కార్యాలయానికి చెందిన స్థానిక సిబ్బందిని తీసుకెళ్తున్న వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో ఒక భారతీయుడు గాయపడ్డాడు. జలాలాబాద్‌లో ఉన్న భారత దౌత్య కార్యాలయం 2020 నుంచి కార్యకలాపాలు కొనసాగించకున్నా అక్కడ నామమాత్రపు భారత్ సిబ్బంది ఉండి పరిమితంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆ దేశంలోని కాబూల్‌లో మాత్రమే భారత దౌత్య కార్యాలయం పనిచేస్తున్నది. అఫ్గాన్ నుంచి అమెరికా బలగాలు వైదొలగిన తర్వాత 2021లో తాలిబన్లు అధికారం చేపట్టారు.

ఐక్యంగా పోరాడితేనే విజయం: డల్లేవాల్

చండీగఢ్, డిసెంబర్ 24: కేంద్రంతో జరుగుతున్న యుద్ధంలో గెలవాలంటే దేశమంతా ఐక్యంగా పోరాడాలని పంజాబ్ రైతు నేత జగ్జీత్ సింగ్ డల్లేవాల్(70) మంగళవారం పిలుపునిచ్చారు. రైతుల డిమాండ్ల సాధన కోసం 29 రోజులగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఆయన శంభులోని రైతుల నిరసన స్థలిలో ప్రత్యేక వేదిక నుంచి రెండు నిమిషాలు మాట్లాడారు. 'మనం ఈ యుద్ధం గెలవాలి. దేశమంతా ఐక్యంగా పోరాడితేనే ఈ యుద్ధం గెలవగలం. మనల్ని ప్రభుత్వం ఇక్కడి నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లగొట్ట కూడదని నేను కోరుకుంటున్నా. అలా జరిగితే మనం గెలుస్తాం లేదా చస్తాం. ఈ రెండింటిలో ఏదో ఒకటి జరుగుతుంది' అని ఆయన బలహీన స్వరంతో తెలిపారు.

పురుష టీచర్‌కు మెటర్నిటీ లీవ్!

బీహార్‌లో విచిత్రం

పాట్నా, డిసెంబర్ 24: బీహార్‌లోని ఒక ప్రభుత్వ టీచర్ మెటర్నిటీ లీవ్‌కు దరఖాస్తు చేయగా, దానిని అధికారులు మంజూరు చేశారు. అయితే ఇందులో విచిత్రమేమిటంటే అలా ప్రసూతి సెలవుకు దరఖాస్తు చేసింది పురుష ఉపాధ్యాయుడు కాగా, దానిని చూడకుండా అధికారులు కళ్లు మూసుకుని ఓకే చేసేశారు. ఆ ఉపాధ్యాయుడు కూడా వారం రోజుల మెటర్నిటీ లీవ్‌ను ఎంజాయ్ చేశాడు. టీచర్ల ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈ విషయం బయటపడటంతో దానికి సంబంధించిన స్క్రీన్ షాట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. అయితే అది 'టెక్నికల్ ఎర్రర్' అని దానిని తర్వాత సవరించినట్టు వైశాలి జిల్లా మహువా బ్లాక్ ఇన్‌చార్జి విద్యాధికారి అర్చనా కుమారి తెలిపారు. మెటర్నిటీ లీవ్ కేవలం మహిళలకు మాత్రమే ఇస్తారని, అలాగే పిల్లలను చూసుకునేందుకు మగవారికి పెటర్నిటీ లీవ్ (పితృత్వ సెలవు)ను మంజూరు చేస్తామని ఆమె వివరణ ఇచ్చారు.

ఉల్లి ధరల పతనంపై దండేసి నిరసన

మహారాష్ట్ర మంత్రికి ఊహించని అనుభవం

నాసిక్, డిసెంబర్ 24: మహారాష్ట్ర మత్స్య శాఖ మంత్రి నితేశ్ రాణెకు సోమవారం ఊహించని నిరసన ఎదురైంది. చిరాయ్ గ్రామంలోని ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మెడలో ఓ ఉల్లి రైతు ఉల్లిగడ్డల దండ వేసి వాటి ధర పతనంపై ఘాటుగా నిరసన తెలిపాడు.నాసిక్ ప్రాంతంలో గత పది రోజుల్లో క్వింటాల్ ఉల్లి ధర రూ.2 వేలకు పడిపోవడంతో రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఉల్లి ఎగుమతులపై 20 శాతం సుంకం విధించడం ధరలను స్థిరీకరించడంలో విఫలమైందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ 20 శాతం పన్నును తొలగించాలని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ విజ్ఞప్తి చేశారు.అకాల వర్షాలు, వాతావరణ మార్పుల వల్ల ఉల్లి రైతులు బాగా నష్టపోతున్నారని ఆయన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు.

నాన్ వెజ్‌లో నాగాలాండ్ టాప్

99.8% మాంసాహార ప్రియులే

న్యూఢిల్లీ, డిసెంబర్ 24: ప్రపంచ వ్యాప్తంగా శాకాహార వంటకాలను ఆరగించే వారి సంఖ్య భారత్‌లోనే అధికంగా ఉంది. అదే సమయంలో దేశంలో 85 శాతం మంది మాంసాహారాన్ని భుజించే వారున్నారని ఒక సర్వే వెల్లడించింది. అయితే మన దేశంలో ముక్క లేకపోతే ముద్ద దిగని రాష్ట్ర ప్రజలు ఎవరంటే నాగాలాండ్ ముందు వరుసలో నిలుస్తుంది. దేశంలోనే అత్యధికంగా ఇక్కడ మాంసాన్ని వినియోగిస్తారు. ఇక్కడి నివసించే వారిలో 99.8 శాతం మంది మాంసాహారాన్ని ఆరగిస్తారని ఆ సర్వే తెలియజేసింది. తర్వాతి స్థానాల్లో పశ్చిమ బెంగాల్ (99.3 శాతం), కేరళ (99.1 శాతం), ఆంధ్ర ప్రదేశ్ (98.25 శాతం) ఉన్నాయి.

ఐదుగురు జవాన్లు దుర్మరణం

- లోయలో పడ్డ ఆర్మీ వాహనం
- మరో ఐదుగురికి తీవ్రగాయాలు
- జమ్మూలోని పూంఛ్‌లో దుర్ఘటన

జమ్మూ, డిసెంబర్ 24: జమ్మూ కశ్మీరులోని పూంఛ్ జిల్లాలో మంగళవారం ఘోర ప్రమాదం సంభవించింది. మెంధర్‌లోని బల్నోయి ప్రాంతంలో సైనిక వాహనం అదుపుతప్పి 350 అడుగుల లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు సైనికులు మృతిచెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. 11 మద్రాస్ లైట్ ఇన్‌ఫాంట్రీకి (11ఎంఎల్ఐ) చెందిన సైనిక వాహనం నీలం హెడ్‌క్వార్టర్స్ నుంచి బల్నోయి ఫోరా పోస్టుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు తెలిపారు. గమ్యస్థానానికి సమీపంలో 350 అడుగుల లోయలో వాహనం పడిపోయినట్టు వారు చెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే 11ఎంఎల్ఐకి చెందిన క్విక్ రియాక్షన్ టీమ్ ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందచేసిన సిబ్బంది వారికి మెరుగైన చికిత్స కోసం వేరే దవాఖానాలకు తరలించింది. గత నెలలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. జమ్మూ కశ్మీరులోని రాజౌరీ జిల్లాలో సైనిక వాహనం అదుపుతప్పి లోయలో పడిపోవడంతో ఒక సైనికుడు మరణించగా మరో వ్యక్తి గాయపడ్డారు.

రష్యాను వణికించిన ఉక్రెయిన్ డ్రోన్లు

- ఏకంగా 8 వేల మంది సైనికులకు చెక్
- 5 మైళ్ల ప్రాంతాన్ని కాపాడుకున్నవైనం

కీవ్, డిసెంబర్ 24: రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ అత్యాధునిక పద్ధతులను అవలంబిస్తున్నది. అందులో భాగంగా ప్రపంచంలోనే తొలిసారి పూర్తిగా సాయుధ రోబోలు, డ్రోన్లతో కూడిన అసాల్టింగ్ ఫోర్స్‌ను రంగంలోకి దింపింది. ఉత్తర ఉక్రెయిన్‌లోని ఖార్ఖివ్ ఒబ్లాస్ట్ ప్రాంతంలో ఈ దళాన్ని ప్రయోగించి రష్యా సేనలపై విజయవంతంగా దాడులు జరిపింది. ట్యాంకు విధ్వంసక ఫిరంగి గుళ్లలాంటి భారీ మందుగుండు సామగ్రిని మోసుకెళ్లగలిగే మల్టీ-రోటర్ కాప్టర్లు, ఎఫ్‌పీవీ డ్రోన్లు, రోబోలతో కూడిన డజన్ల కొలదీ యూనిట్లు సంప్రదాయ సైనిక బలగాల మాదిరిగా పరస్పరం సహకరించుకుంటూ ఏకకాలంలో ఈ దాడుల్లో పాల్గొన్నట్టు ఉక్రెయిన్ 13వ నేషనల్ బ్రిగేడ్ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఈ దాడుల సందర్భంగా ఆ యూనిట్లు దాదాపు 8 వేల మంది రష్యా సైనికులను విజయవంతంగా ప్రతిఘటించి 5 మైళ్ల (8 కిలోమీటర్ల) ప్రాంతాన్ని కాపాడినట్టు తెలిపారు. కాగా, గతంలో రష్యా సైతం ఇలాంటి ఆధునిక పద్ధతుల్లో దాడులు నిర్వహించినప్పటికీ అవి పెద్దగా విజయవంతం కాలేదు. దీంతో యుద్ధంలో సైనికుల స్థానాన్ని డ్రోన్లు ఎప్పటికీ భర్తీ చేయలేవన్న వాదన గట్టిగా వినిపించింది. కానీ, ఇప్పుడు ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఉక్రెయిన్.. రోబోలు, డ్రోన్ల దళంతో రష్యా సేనలను విజయవంతంగా ప్రతిఘటించడంతో ఆ వాదనకు తెరపడే అవకాశం కనిపిస్తున్నది.

ప్రభుత్వ లాంఛనాలతో బెనెగల్ అంత్యక్రియలు

ముంబై, డిసెంబర్ 24: దర్శక దిగ్గజం, సమాంతర సినిమాకు ఆద్యుడు శ్యామ్ బెనెగల్‌కు మంగళవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. దాదార్‌లోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో సాయంత్రం 3 గంటలకు శ్యామ్ బెనెగల్ భౌతిక కాయానికి అంత్యక్రియలు ముగిశాయి. పలువురు సినీ ప్రముఖులు హాజరై నివాళులు అర్పించారు. శ్యామ్ బెనెగల్ సోమవారం తన 90వ ఏట ఓ ప్రైవేట్ దవాఖానలో కిడ్నీ సంబంధిత వ్యాధితో కన్నుమూశారు.

వాట్సాప్‌లోనే ఇక డాక్యుమెంట్ల స్కానింగ్!

థర్డ్‌పార్టీ యాప్స్‌కు చెక్

న్యూఢిల్లీ: థర్డ్‌పార్టీ యాప్స్ అవసరం లేకుండా కెమెరాతోనే డాక్యుమెంట్లను స్కాన్ చేసి షేర్ చేసుకునేలా కొత్త ఫీచర్‌ను వాట్సాప్ రెడీ చేస్తున్నది. ఇప్పటికే ఈ ఫీచర్ ఐవోఎస్ తాజా వెర్షన్‌లో అందుబాటులో ఉంది. డాక్యుమెంట్లను వేగంగా షేర్ చేయాలనుకున్న వారికి ఈ ఫీచర్ ఎంతగానో ఉపకరిస్తుంది. యూజర్లు చేయాల్సిందల్లా డాక్యుమెంట్ షేరింగ్ మెనూను ఓపెన్ చేసి 'స్కాన్' ఆప్షన్‌ను ఎంచుకుంటే కెమెరా యాక్టివేట్ అవుతుంది